# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 25-11-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 82 పేజీలు:6 వెల: రూ.1/-


## గుజరాత్ తొలి దశ ఎన్నికలు.. 21 శాతం అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

అహ్మదాబాద్, నవంబర్ 24:గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్న విషయం తెలిసిందే. అయితే తొలి దశ ఎన్నికల్లో 89 సీట్ల కోసం మొత్తం 788 మంది పోటీ చేస్తున్నారు. దాంట్లో 167 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) తన రిపోర్ట్‌లో పేర్కొన్నది. 100 మందిపై మర్డర్, రేప్ లాంటి తీవ్రమైన కేసులు ఉన్నట్లు ఏడీఆర్ చెప్పింది. తొలి దశ అభ్యర్థుల్లో మొత్తం 21 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు తేలింది. దీంట్లో 13 శాతం మంది సీరియస్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.క్రిమినల్ అభ్యర్థులు ఉన్న జాబితాలో ఆమ్ ఆద్మీ పార్టీ ఫస్ట్ ఉంది. ఆ పార్టీ తొలి దశలో 88 స్థానాల్లో పోటీ చేస్తోంది. దాంట్లో 36 శాతం అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 30 శాతం మందిపై రేప్, మర్డర్, కిడ్నాప్ కేసులు ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి 35 శాతం, బీజేపీ నుంచి 16 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

## దేశంలో ఆటవిక రాజ్యం కొనసాగుతుంది

**–సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**



హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశంలో ఆటవిక రాజ్యం కొనసాగుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మోదీ హయాంలో వ్యవస్థలు ధ్వంసమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఐటీ, ఈడీలను ప్రయోగిస్తుందన్నారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవారిపై ఒక్క దాడైనా జరిగిందా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఇప్పటివరకు మూడు వేల ఈడీ కేసులు నమోదయ్యాయని చెప్పారు. వాటిలో ఒక్కటి కూడా నిరూపితం కాలేదని చెప్పారు. రాజకీయ కక్షతో దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన నేరస్తుడు పీఎం మోదీయేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యేలను లొంగదీసుకునేందుకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఒక అజ్ఞాని అని, ఆయన నటన ముందు ఎవరూ సరిపోరని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎర కేసులో బీఎల్ సంతోష్‌కు నోటిసులిస్తే ఏడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరవరరావులాంటి వారిని జైల్లో పెట్టినప్పుడు ఎందుకు స్పందించలేదన్నారు. సంతోష్ ఏమైనా దేవుడా.. నోటిసులిస్తే తప్పేంటని నిలదీశారు. సీఆర్‌పీసీ 41ఏ ప్రకారం అధికారులకు ప్రశ్నించే అధికారం ఉందని చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కూడా విచారించాలని సిట్ అధికారులను విజ్ఞప్తి చేశారు.

## చైనాలో రికార్డు స్థాయికి కరోనా కేసులు.. కొత్తగా 31 వేల మందికి పాజిటివ్

న్యూఢిల్లీ, నవంబర్ 24:కరోనా పుట్టిల్లు చైనాలో మహమ్మారి విజృంభిస్తున్నది. దీంతో రికార్డు స్థాయిలో పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. దేశంలో కొత్తగా 31,454 కేసులు రికార్డయ్యాయని నేషనల్ హెల్త్ బ్యూరో తెలిపింది. ఇందులో 27,517 మందికి ఎలాంటి లక్షణాలు లేవని వెల్లడించింది. దీంతో కరోనా కేసులు ప్రారంభమైన నాటినుంచి ఒక్కరోజులో ఇంత మందికి పాజిటివ్ రావడం ఇదే మొదటిసారని పేర్కొన్నది. బుధవారం 29,390 కేసులు నమోదయ్యాయని చెప్పింది. ఈ నేపథ్యంలో వైరస్ వ్యాప్తిని నిలువరించడానికి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్లు అమలు చేస్తుండగా, ప్రయాణాలపై ఆంక్షలు విధిస్తున్నారు. భారీ సంఖ్యలో పరీక్షలు చేస్తున్నారు.

కాగా, చైనాలో గత కొన్నిరోజులుగా 20 వేలకుపైగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. దీంతో 'జీరో కరోనా' విధానం మేరకు మళ్లీ కొత్త ఆంక్షలను అధికారులు ప్రకటించారు. సుమారు ఆరు నెలల తర్వాత ఈ నెల 20న చైనాలో తొలి కరోనా మరణం నమోదైంది. రాజధాని బీజింగ్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 87 ఏళ్ల వృద్ధుడు ఆదివారం మరణించాడు. దీంతో దేశంలో మొత్తం కరోనా మరణాల సంఖ్య 5,227కు చేరింది. ఈ నేపథ్యంలో ఆ దేశ అధికారులు మళ్లీ కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ టీచింగ్ విధానానికి స్కూళ్లు మళ్లాయి. కార్యాలయాలు, రెస్టారెంట్లను మూసివేశారు. అనవసరంగా బయటకు రావద్దని ప్రజలకు సూచించారు.

## అమ్మాయిలకు అనుమతి లేదు.. ఢిల్లీ జామా మసీదులో నోటీసులు

న్యూఢిల్లీ, నవంబర్ 24: దేశ రాజధాని ఢిల్లీలోని జామా మసీదు చాలా ఫేమస్. అయితే ఆ మసీదులోకి మహిళల ఎంట్రీపై నిషేధం విధించారు. అమ్మాయిలు సింగిల్‌గా కానీ, గ్రూపులుగా కానీ మసీదులోకి రావొద్దు అని గేట్ల వద్ద నోటీసులు అతికించారు. దీంతో ఈ అంశంపై వివాదం చెలరేగుతోంది. జామా మసీదు షాహి ఇమామ్ స్పందిస్తూ.. ఆ నోటీసులు ప్రార్ధనలు చేసే అమ్మాయిలకు వర్తించవన్నారు.

మహిళల ఎంట్రీపై నిషేధం విధించడం పట్ల కొన్ని మహిళా హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మసీదు నిర్ణయం ఆమోదయోగ్యంగా లేదన్నాయి. జామా మసీదుకు ఉన్న మూడు గేట్ల వద్ద ఆ నోటీసులను అతికించారు. 17వ శతాబ్ధంలో మొఘల్ చక్రవర్తులు నిర్మించిన మసీదుకు ప్రతి రోజు వేలాది మంది టూరిస్టులు వస్తుంటారు. మసీదు నిర్ణయాన్ని ఖండిస్తూ ఢిల్లీ మహిళా సంఘం జామా మసీదుకు నోటీసులు జారీ చేసింది.షాహి ఇమాబ్ సయ్యిద్ అహ్మద్ బుకారి మాట్లాడుతూ మసీదు ఆవరణలో కొన్ని అభ్యంతరకర సంఘటనలు జరుగుతున్నాయన్నారు. జామా మసీదు ఓ ప్రార్ధనా స్థలమని, ప్రార్ధనల కోసం వచ్చేవారిని స్వాగతిస్తామని, కానీ డేటింగ్ కోసం ఒంటరిగా వచ్చే మహిళల్ని నిషేధిస్తున్నామన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ విభవముగల ఇందిరనే
సభలావల నుండి గెంటు - సత్యాత్ముండే
ప్రభవించెను మాన్యుండై
నభసము లా నుండి "రాజనారాయణుడై !!

(నవంబర్ 25 రాజ్ నారాయణ్ జయంతి....)

–రాధశ్రీ

సెల్:9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## సంక్షేమమే ధ్యేయంగా ముందుకు : మంత్రి తలసాని



హైదరాబాద్, నవంబర్ 24: పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్ శ్రీరామ్‌నగర్‌లో రూ. 2కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్టీపర్పస్ కమ్యూటీ హాల్, బస్తీ దవాఖాన భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నూతనంగా నిర్మించున్న భవనంలో ఫంక్షన్ హాలు, బస్తీ దవాఖానాతో పాటు అంగన్‌వాడీ కేంద్రం ఉండేలా చూడాలని, ప్లేగ్రౌండ్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గత 40–50 సంవత్సరాల నుంచి కాలనీ ప్రజలు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరినా.. ఎవరూ పట్టించుకోలేదన్నారు.మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం కృషితో అభివృద్ధి పనులు మంజూరయ్యాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. బస్తీల్లో అవసరమైన అన్ని రకాల సదుపాయాలు, వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధతో నగరంలో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని బీఎస్ మక్తా, దీన్‌దయాల్ నగర్, గౌరీ శంకర్ నగర్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీ తదితర ప్రాంతాల్లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్ మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, డీసీ రజనీకాంత్ రెడ్డి, ఈఈ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధరణి వ్యవస్థను రద్దుచేసి పోడు, మిగులు భూములకు పట్టాలివ్వాలి

**–మహబూబాబాద్ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు మెట్టు నాగేష్**

**–రైతు రుణాలు పూర్తిగా మాఫీ చేయాలి...**

**–కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్**

మహబూబాబాద్, నవంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని, ధరణి వ్యవస్థని పూర్తిగా రద్దు చేయాలంటూ, నిరసన వ్యక్తం చేస్తూ చౌరస్తా వద్ద వాహనాలను నిలిపివేసి ధర్నా నిర్వహించారు.

తర్వాత మండల తహసిల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి, తాహసిల్దార్ రమేష్ బాబు కి భూముల రికార్డుల సవరణ చేయాలంటూ, వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్ మరియు మహబూబాబాద్ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు మెట్టు నాగేష్ మాట్లాడుతూ, ధరణి వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలంటూ, రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని , రైతులకు రుణమాఫీ చేస్తానంటూ ఈ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని, రైతుల రుణాలను వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంతకుముందు ప్రతి రైతుకి రుణాలు పూర్తిగా మాఫీ చేసిందని అదేవిధంగా ఇప్పుడు కూడా రుణాలు వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ధరణి వల్ల చాలా మిగులు భూములు పోడు భూములకు పట్టాలు అవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ధరణి వల్ల ఎవరికి లాభం జరుగుతుంది ఎవరికీ నష్టం జరుగుతుందో ఒకసారి టిఆర్ఎస్ నాయకులు చెప్పాలన్నారు.

ధరణి అనేది కేవలం బడా నాయకులకు, మరియు కెసిఆర్ కే లాభమని అది రైతులకు ఎలాంటి లాభం లేదని, కెసిఆర్ ప్రభుత్వం కేవలం వారి కుటుంబాలకు ఆస్తులు పెంచడం కోసం ధరణి తీసుకొచ్చారని, దీనిని ఒక ప్రైవేటు వ్యవస్థకు అప్పచెప్పడం బాధాకరం అని తెలియజేశారు.




ఈ కార్యక్రమంలో రెడ్డి కుంట తండా సర్పంచ్ జగ్గు నాయక్ ,ఎస్ టి సెల్ అధ్యక్షులు సీతరాం నాయక్,మాన్నూర్ వేణు,ఎస్సీ సెల్ సైదులు , మైనారిటీ సెల్ అధ్యక్షులు అబ్దుల్లా, మండల ప్రధాన కార్యదర్శి శ్రీను, మండలనాయకులు పూర్ణచంధర్, సూదగాని రాంబాబు, రఘు, రాజు తీర్మాల్ రెడ్డి ,పాషా, వెంకన్నసంతోష్ , వినోద్ , అనిల్, కర్ణాకర్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ముందు నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన ఆటో డ్రైవర్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 24: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ కార్యాలయం ముందు ఇర్షాద్ అనే యువకుడు గురువారం స్థానిక బివిస్పి నాయకులతో కలిసి నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు వివరాల్లోకి వెళితే.. ఇర్షాద్ అనే యువకుడు వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో చెత్త తరలించే ఆటో డ్రైవర్ గా పని చేశాడు. ఒకరోజు డ్యూటీకి లేటుగా రావడంతో గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్, స్థానిక చైర్మన్ భర్త రామతీర్థపు రాజు డ్యూటీ కి రావద్దని వెళ్లగొట్టారని, ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కమిషనర్ ను కలిసిన న్యాయం జరగడం లేదని, ఇంటర్వ్యూ ద్వారా పాస్ అయి డ్యూటీ చేస్తున్న నన్ను అకారణంగా తీసివేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై నాకు న్యాయం జరగడం లేదని మున్సిపల్ కార్యాలయం, స్థానిక బివిస్పీ నాయకులతో కలిసి నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు.

## అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లుగా మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేస్తాం...

**–రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి డా. వి. శ్రీనివాస్.**

మహబూబ్ నగర్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగాన్ని పటిష్టం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ అకాడమిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి వాలీబాల్ అకాడమీ కోసం క్రీడాకారుల ఎంపిక కొనసాగుతుందని, అర్హులైన క్రీడాకారులు అకాడమీ ఎంపికలకు హాజరు కావాలన్నారు. 14 నుంచి 18 సంవత్సరాల వయసులోపు బాల బాలికల ఎంపికలో మెరుగైన ప్రదర్శన చేసిన క్రీడాకారులను అధికారులు ఎంపిక చేస్తారని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారులను తయారు చేసేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఎలాంటి అదనపు సదుపాయాలు అవసరమైనా కల్పించి అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో బాక్సర్ నిఖత్ జరీన్, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ ఆకుల శ్రీజ... దేశంలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఇచ్చే ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు ఎంపికయ్యారని, చక్కటి సౌకర్యాలు కల్పించడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. తెలంగాణ రాష్ట్రం క్రీడలకు పెద్దపీట వేస్తూ ఉందని ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. గ్రూప్స్‌లో మరిన్ని కొలువులు..!

హైదరాబాద్, నవంబర్ 24: ప్రభుత్వం నిరుద్యోగులకు తీపికబురును అందించింది. ఇటీవల గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తి కాగా.. త్వరలో గ్రూప్–,2 3, 4 పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నది. వాటిలో ఉన్న పోస్టులకు తోడు మరిన్ని పోస్టులు చేరుస్తున్నది. గ్రూప్–2లో కొత్తగా ఆరు రకాల పోస్టులు చేర్చగా, గ్రూప్–3 రెండు రకాల పోస్టులు, గ్రూప్–4లో నాలుగు రకాల పోస్టులు ప్రభుత్వం ఉత్తర్వులు తెలిపింది. ఈ మేరకు గతంలో జారీ చేసిన 55 జీవోలో సవరణలు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. తాజా నిర్ణయంతో గ్రూప్–2, 3, 4లో పోస్టులు మరిన్ని పెరిగే అవకాశం ఉన్నది.

### గ్రూప్–2లో చేర్చిన పోస్టులు ఇవీ..

అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిష్ సర్వీస్)

అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఇతర శాఖలకు సంబంధించి)

జువైనల్ డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్

### గ్రూప్–3లో..

గిరిజ సంక్షేమ శాఖ అకౌంటెంట్‌సీనియర్ అసిస్టెంట్/అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్/అకౌంటెంట్ లేదా హెచ్ఓడీల్లో ఇదే విధమైన పోస్టులు

### గ్రూప్–4లో..

జిల్లా కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అకౌంటెంట్

జువైనల్ సర్వీసెస్ సూపర్‌వైజర్ (మేల్) (జువైనల్ సర్వీసెస్, డబ్ల్యూసీడీ అండ్ ఎస్సీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్)

మ్యాట్రన్ కమ్ స్టోర్ కీపర్, మ్యాట్రన్ (కమిషన్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్)

## బెయిల్ మంజూరుపై ఢిల్లీ హైకోర్టులో ఛాలెంజ్ చేసిన సీబీఐ

న్యూ డిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఢిల్లీ మద్యం కేసు లో సీబీఐ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్‌లకు బెయిల్‌ను రద్దు చేయాలంటూ సీబీఐ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సీబీఐ పిటిషన్‌పై స్పందించాలని అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్‌లకు నోటీసులు జారీ చేసింది. మద్యం కుంభకోణం వ్యవహారంలో విచారణకు సహకరించలేదని అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్‌లను సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కస్టడీలో విచారణ అనంతరం 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ తర్వాత ఈ నెల 21న ఇరువురికి రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు బెయిలు మంజూరు చేసింది. ప్రత్యేక కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను సీబీఐ ఢిల్లీ హైకోర్టులో ఛాలెంజ్ చేసింది.

## 27న బిపి మండల్ విగ్రహావిష్కరణ

**-బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్ల వెంకట్ యాదవ్**

హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సారిగా బీసీల ఆరాధ్య దైవం ,బీసీ రిజర్వేషన్ల పితామహులు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ బిందేశ్వరి ప్రసాద్ మండల్ ( బి పి మండల్ ) విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 27 న తిరుపతిలో జరుగుతున్నట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్ల వెంకట్ యాదవ్ తెలిపారు.బీసీ సంఘం, బీసీ విద్యార్థి సంఘం మరియు జాతీయ అఖిల భారత యాదవ మహా సంఘం వివిధ బీసీ కుల సంఘాల నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు ఆయన తెలిపారు. వివిధ రాష్ట్రాల్లోని అనగా ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,కర్ణాటక, కేరళ,తమిళనాడు రాష్ట్రాలలోని బీసీ ప్రముఖులు, అభిమానులు పాల్గొంటున్నట్లు తెలిపారు.రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్న మన బీసీ లు ఆ సామజిక ఉద్యమ శిఖరం మహానుభావుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం మన నైతిక ధర్మం, కావున బి సీ సోదరులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని బొల్ల వెంకట్ యాదవ్ పిలుపునిచ్చారు.

## మూడవ రోజు కుడా కొనసాగుతున్న ఐటి సోదాలు

**–ప్రభుత్వ రాయితీలతో సొసైటీ కింద నడుస్తున్న మల్లారెడ్డి విద్యాసంస్థలు**

**–ఇప్పటి వరకు రూ. 26 కోట్ల నగదు స్వాదీనం: ఐటి అధికారులు వెల్లడి**

హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );"తెలంగాణ రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి విద్యాసంస్థల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్టు ప్రాథమికంగా గుర్తించామని ఐటీ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ రాయితీలతో సొసైటీ కింద నడుస్తున్న మల్లారెడ్డి విద్యాసంస్థల్లో నిర్దేశించిన ఫీజు కంటే ఎక్కువ మొత్తాలు వసూలు చేసినట్టు గుర్తించారు. అదనంగా వసూలు చేసిన మొత్తాలను నగదు రూపంలో తీసుకున్నట్టు ఆధారాలు సేకరించినట్టు ఐటీ వర్గాలు తెలిపాయి. అనధికారికంగా, లెక్కల్లో చూపకుండా నగదు రూపంలో వసూలు చేసిన మొత్తాలను స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు, మల్లారెడ్డి–నారాయణ ఆసుపత్రి కోసం వెచ్చించినట్టు పేర్కొన్నారు.ఇప్పటి వరకు చేసిన సోదాల్లో రూ. 6కోట్ల నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. కాగా మంత్రి మల్లారెడ్డి నివాసంలో ఆరు లక్షలు మల్లారెడ్డి పెద్ద కుమారుడు ఇంట్లో 12 లక్షలు మల్లారెడ్డి చిన్న కుమారుడు ఇంట్లో 6 లక్షలు, మల్లారెడ్డి అల్లుడు ఇంట్లో మూడు కోట్లు, ప్రవీణ్ రెడ్డి ఇంట్లో 15 కోట్లు, త్రిశూల్ రెడ్డి ఇంట్లో రెండు కోట్లు ,రఘునందన్ రెడ్డి నివాసంలో రెండు కోట్లు ,ప్రవీణ్ కుమార్ నివాసంలో 2.5 కోట్లు, సుధీర్ రెడ్డి నివాసంలో కోటి రూపాయలు సీజ్ చేసినట్లు ఐటి అధికారులు వెల్లడించారు హైదరాబాద్ రీజియన్ పరిధిలోని ఐటీ అధికారులతో పాటు ఒడిశా, కర్ణాటక నుంచి వచ్చిన 400 మందికి పైగా ఐటీ అధికారులు, సిబ్బంది 65 బృందాలుగా ఏర్పడి సోదాలు చేశారు. కొన్ని చోట్ల సోదాలు ముగిశాయి. మరికొన్ని చోట్ల రాత్రికి ముగిసే అవకాశముందని, ఇంకొన్ని చోట్ల రేపు కూడా కొనసాగే అవకాశం ఉన్నట్టు ఐటీ వర్గాలు వెల్లడించాయి. స్థిరాస్తులను కూడా వాస్తవ విలువ కాకుండా తక్కువ చూపినట్టు.. ఆధారాలు సేకరించామని పేర్కొన్నారు. మల్లారెడ్డి వియ్యంకుడు వర్ధమాన కళాశాలలో డైరెక్టర్‌గా ఉండటంతో అక్కడ కూడా సోదాలు చేసినట్టు వెల్లడించారు.

## రష్యాను ఉగ్రవాద ప్రోత్సాహక దేశంగా ప్రకటించిన ఈయూ పార్లమెంట్

న్యూ డిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగిస్తున్న రష్యాను ఉగ్రవాద ప్రోత్సాహక దేశంగా ప్రకటించే తీర్మానానికి యూరోపియన్ పార్లమెంటు మద్దతు పలికింది. ఉక్రెయిన్‌లో పౌరులే లక్ష్యంగా స్కూళ్లు, దవాఖానలు, విద్యుత్ కేంద్రాలపై రష్యా సైన్యం దాడులకు పాల్పడుతున్నదని, ఇది అంతర్జాతీయ చట్టాలను అతిక్రమించడమేనని స్పష్టం చేసింది. ఈ తీర్మానంపై ఐరోపా పార్లమెంటులో ఓటింగ్ నిర్వహించగా.. 494 మంది సభ్యులు మద్దతు పలుకగా, 58 మంది వ్యతిరేకించారు. మరో 44 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. యూరోపియన్ పార్లమెంట్ రష్యాను ఉగ్రవాద ప్రోత్సాహక దేశంగా తీర్మానించడాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వాగతించారు. తమ దేశంపై దురాక్రమణకు పాల్పడుతున్న రష్యా.. ఉక్రేనియన్లే లక్ష్యంగా దాడులు చేస్తున్నందతూ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశాన్ని ఉగ్రవాద ప్రోత్సాహక దేశంగా ప్రకటించాలని అమెరికాతోపాటు ప్రపంచ దేశాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో ఉక్రెయిన్–రష్యా యుద్ధం వల్ల ఆర్థికంగా, విద్యుత్, చమురు పరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్న యూరిపియన్ దేశాలు ఈ తీర్మానానికి మద్దతు తెలిపాయి. ఈ తీర్మానానికి మద్దతు తెలపడానికి అమెరికా నిరాసక్తత వ్యక్తంచేస్తున్నది.కాగా, ఐరోపా పార్లమెంటు తీర్మానంపట్ల రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. యూరోపియన్ పార్లమెంటును మూర్ఖత్వానికి స్పాన్సర్‌గా నియమించాలని ప్రతిపాదిస్తున్నానని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా వ్యాఖ్యానించారు.

## కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ కమిటీ భేటీ వాయిదా..

హైదరాబాద్, నవంబర్ 24: తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ కమిటీ భేటీ వాయిదా పడింది. ఏపీ జెన్ కో సీఈ అభ్యర్థన మేరకు వాయిదా వేసినట్లు సమాచారం. సీఎం జగన్ తో సమావేశం ఉన్నందున రాలేకపోతున్నట్లు ఏపీ అధికారులు తెలిపారు. దీంతో డిసెంబర్ 3వ తేదీకి కేఆర్ఎంసీ సమావేశం వాయిదా పడింది. కాగా డిసెంబర్ 3న తుది సమావేశం నిర్వహించనున్నట్లు కేఆర్ఎంసీ తెలుగు రాష్ట్రాలకు సమాచారం అందించింది.

# 'నిర్భయ'లకు రక్షణ కరువైన భారతం..!

## (25 నవంబర్ "అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం" సందర్భంగా)

ప్రకృతిలో స్త్రీ పురుషులు సర్వసమాన భాగాలే అయినప్పటికి, స్త్రీజాతిని ద్వితీయ శ్రేణి పౌరులుగా లింగ వివక్షతో అణిచి వేస్తూ, వారి పట్ల చులకన భావనలు, వేధింపులు, అత్యాచారాలు, హత్యలు, బాలికలపై లైంగిక దాడులు, బాల్యవివాహాలు, అక్రమ రవాణ, రేప్‌లు, భ్రూణహత్యలు, గృహ హింసలు, బాలకార్మికులు అన్ని దేశాల్లో సర్వసాధారణ సమస్యలుగానే కనబడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 35 శాతం మహిళలు తమ జీవితకాలంలో ఏదో ఒక రకమైన లైంగిక వేధింపులను అనుభవిస్తున్నారని, వీరిలో 40 శాతం అబలలు వేధింపుల నుండి సహాయాన్ని కోరుతున్నారని, 10 శాతం మాత్రమే స్త్రీలు మాత్రమే న్యాయం కోసం చట్టాన్ని ఆశ్రయిస్తున్నారని తేలింది. మహిళలపై అత్యాచారాలు జరిగినపుడు జనావేశం క్షణాల్లో పొంగడం, వ్యతిరేక గళాలు మిన్నంటడం, రెండు రోజుల తరువాత అన్ని మరిచి పాత కథలు పునరావృతం కావడం సర్వసాధారణం అయ్యింది. ప్రతి రోజు ఏదో ఒక మూలన మహిళ మానభంగ మౌన రోధన గొంతు దాటడం లేదు, విని స్పందించేందుకు బదులు ఎగతాళి, ప్రతి దశలో అవమానాలు, చిన్నచూపు చూసే సమాజం మనది.

అతివలపై అత్యాచారాలు:

ఐరాస వివరాల ప్రకారం మానవ అక్రమ రవాణాలో 71 శాతం మహిళలు, బాలికలే ఉన్నారని అంచనా. వివాహిత మహిళల్లో 52 శాతం మాత్రమే కొంత స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక రేప్ కేసులు నమోదైన దేశాల జాబితాలో (లక్ష మందిలో) దక్షిణ ఆఫ్రికా (132.4), బోత్సవానా (92.9), స్వీడెన్ (63.5), గ్రనెడా (30.6), అమెరికాలో (27.3) లాంటి దేశాలు అగ్ర భాగాన ఉన్నాయి. అమెరికాలో 9 శాతం రేపిస్టులపై విచారణలు జరుగగా, 3 శాతం మాత్రమే శిక్షలు అనుభవిస్తూ, 97 శాతం రేపిస్టులు స్వేచ్ఛగా బయట హీరోల్లా తిరుగుతున్నారు. వాస్తవానికి మహిళలపై జరిగే అధిక అత్యాచార కేసులు బయట పడడం లేదు. సమాజ చులకన భావం ఎదుర్కోవలసి వస్తుందని, మహిళ భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుందనే కారణాలతో, వారికి జరిగిన అన్యాయాన్ని సహిస్తూ దుర్భర బతుకులు ఈడ్చుతున్నారు. కోవిడ్–19 విజృంభన తరువాత వచ్చిన సామాజిక మార్పుల కారణంగా కూడా మహిళలపై గృహ హింస వేధింపులు కూడా పెరిగాయని తేలింది. ప్రపంచ మహిళాలోకంపై జరుగుతున్న అత్యాచారాలు, హింసాత్మక పోకడలను గమనించిన ఐరాస సభ్యదేశాలు 2000 నుంచి ప్రతియేటా 25 నవంబర్ రోజున 'అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం' పాటించుట జరుగుతోంది. 25 నవంబర్ 1960న డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన ముగ్గురు బిరాబల్ సిస్టర్స్ హత్యకు నిరసనగా ఈ రోజును పాటిస్తున్నారు. "మహిళా హింసకు 'నో' చెబుదాం" అంటుంది యునెస్కో. ఐక్యతతో మహిళా హింసను అడ్డుకోవాలనే లక్ష్యంతో 25 నవంబర్ నుండి 10 డిసెంబర్ వరకు లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా 16 రోజుల కార్యక్రమాలను ఐరాస చేపడుతున్నది.

'నిర్భయ'ల రక్షణ కరువు:

ప్రపంచవ్యాప్తంగా మానభంగాల రేటులో 120 దేశాల్లో భారత్ 95వ స్థానంలో ఉంది. భారత్‌లో నిర్భయలు, దిశలు, హత్రాస్‌లు ఎన్ని జరిగినా, ప్రభుత్వ యంత్రాంగం హడావుడీ, ప్రజల క్షణికావేశాలు ప్రదర్శించడం తప్ప ఊహించిన సమూల మార్పులు రావడం లేదు. ఇండియాలో రేప్‌ల రేటు 4.2 శాతం (ఒక లక్షలో) ఉండగా, చండీఘర్ 20.7 శాతం, రాజస్థాన్ 15.9 శాతం, ఢిల్లీ 13.5 శాతం, కేరళ 11.1 శాతం, హర్యానా 10.9 శాతం, అస్సాం 10.5 శాతం, హిమాచల్ 10.0 శాతంతో ముందు ఉండగా గుజరాత్ 1.6 శాతం, కర్నాటక 1.6 శాతం, తమిళనాడు 1.0 శాతం, నాగాలాండ్ 0.8 శాతంతో చివరన ఉన్నాయి. ఈ జాబితాలో తెలంగాణ 4.7 శాతం, ఆంధ్రప్రదేశ్ 4.2 శాతం రేప్ రేటు నమోదు అయినాయి. మన దేశంలో ప్రతి 16 నిమిషాలకు ఒక రేప్ కేస్ బయట పడడం అత్యంత అవమానకరం. 2019లో దేశ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 1,253 కేసుల సంఖ్య, జైపూర్‌లో అధిక రేప్ రేటు నమోదైనాయి. గత పది సంవత్సరాల్లో దేశంలోని 66 శాతం రేప్ కేసులు రాజస్థాన్, యంపీ, కేరళ, యూపీ, మహారాష్ట్ర, అస్సాం, హర్యానా, ఝార్ఖండ్, ఒడిసా, ఢిల్లీ రాష్ట్రాలలో జరిగాయి. ఈ రాష్ట్రాల్లో గత 10 సంవత్సరాల్లో రేప్ కేసులు రెట్టింపు కాగా మిగిలిన 26 రాష్ట్రాల్లో మానభంగ కేసులు పెరగలేదని తేలింది. ఈ రాష్ట్రాల్లో గత దశాబ్దకాలంలో రేప్ కేసులు నాలుగు రెట్లు పెరగడం విచారకరం. 2019లో జరిగిన రేప్ కేసుల్లో 16.2 శాతం దళిత మహిళలు, 83.8 శాతం ఇతర వర్గాల మహిళలు ఉన్నారని తెలుస్తున్నది.

మైనర్ బాలికల అక్రమ రవాణా భూతం:

సహజంగా మదమెక్కిన మానవ మృగాలు బలహీన అతివలపై చేసే అత్యాచారమే మానభంగ దుర్మార్గం. 'హ్యూమన్ రైట్స్ వాచ్' నిర్వహించిన సర్వే ప్రకారం ప్రతియేటా భారత్‌లో 7,200 మైనర్ బాలికలు (ఒక లక్షలో 1.6) రేప్‌కు గురుకావడం జాతికి సిగ్గు చేటుగా గమనించాలి. మైనర్ బాలికల రేప్ కేసుల తరువాత వారిని అక్రమ మానవ రవాణా ద్వారా జీవితకాలం వ్యభిచార నరక కూపంలోకి నెట్టబడడం కూడా జరుగుతున్నది. భారతదేశంలో నమోదైన రేప్ కేసులలో 27.8 శాతం (నలుగురు రేపిస్టుల్లో ఒక్కరు) నిందితులకు మాత్రమే ఆలస్యంగానైనా శిక్షలు పడుతున్నాయి. దేశ జనావేశం కట్టలు తెంచుకున్న ఢిల్లీ నిర్భయ కేసులోనే నిందితులకు శిక్ష పడడానికి ఆరు సంవత్సరాలకు పైగా సమయం పట్టడం దురదృష్టకరం. ఈ ఆలస్యానికి కారణం పోలీస్ యంత్రాంగమని న్యాయ వ్యవస్థ వేలు చూపితే, న్యాయ వ్యవస్థ, నిందితులు, భాదితులే ఆలస్యానికి బాధ్యులని పోలీసులు అనడం సర్వ సాధారణం అయ్యింది. న్యాయం ఆలస్యంగా అందితే, న్యాయం అందనట్లే అని అందరం భావించాలి. 16 నుంచి 24 ఏండ్ల యువతులు అధిక శాతం మానభంగానికి గురి అవుతున్నట్లు తేలింది. రేప్ చేసిన మానవ మృగాల్లలో 70 శాతం భాదితురాలికి తెలిసిన వారే ఉన్నారని గమనించాలి. విద్యావంతులు, నాగరికత తెలిసిన పెద్దలు ఎక్కువగా ఉన్న ఢిల్లీ, ఛండీఘర్ మహానగరాల్లో మానభంగాలు ఎక్కువగా నమోదుకావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. రేపిస్టులకు వెంటనే శిక్షలు పడేలా న్యాయ మరియు పోలీస్ వ్యవస్థలు కాల పరిధిలో చర్యలు తీసుకోవాలి. మానభంగం తరువాత హత్య చేయడం పరిపాటి అయ్యింది. ఇలాంటి క్రూరులకు వెంటనే ఉరి శిక్ష పడడమే ఏకైక మార్గం.

నేటి తల్లితండ్రులు తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలి. యూనివర్సిటీల డిగ్రీల కన్న మానవీయ విలువలే ప్రధానమని, చదువు కన్న సంస్కారమే మిన్నయని గుర్తించాల్సిన సమయమిది. ప్రతి అమ్మాయి భారతమాత ముద్దు బిడ్డగా పూజించబడాలి. నేటి అమ్మాయిలు అవసరమైతే సబలలుగా మారి, మృగాళ్ల మదాన్ని అణిచే అపరకాళిగా గర్జించాలి. స్త్రీలో ఐశ్వర్య లక్ష్మిని, చదువుల తల్లి సరస్వతిని, ధైర్య ప్రతీక దుర్గలను దర్శించే నాగరిక భారత సమాజాన్ని నిర్మించే మహాయజ్ఞంలో మనందరం భాగస్వాములం అవుదాం. భరతమాతకు, మాతృ సమాన మహిళకు ప్రణమిల్లుదాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# 27న విశాఖ విశ్వబ్రాహ్మణ కార్తీక వనసమారాధన జయప్రదం చేయండి

**– జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్**



విశాఖపట్నం నవంబరు 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఈ నెల 27న విశాఖ విశ్వబ్రాహ్మణ కార్తీక వనసమారాధన జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ పిలుపు నిచ్చారు. విశాఖపట్నం ఆంధ్ర ప్రదేశ్ స్వర్ణకార సంఘ కార్యాలయంలో బీచ్ రోడ్డు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వెనుక ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ ను కలిసి విశాఖ విశ్వబ్రాహ్మణ కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శివకోటి వాసు ,ప్రముఖ పాత్రికేయు నాయకులు వేణుగోపాల్ , సురేష్ , ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల క్రితం ఫ్రిజ్‌లో పెట్టిన అండాలతో కవల పిల్లలకు జన్మనిచ్చింది మహిళ

న్యూడిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అమెరికాలోని టెన్నిసి రాష్ట్రంలో 30 ఏళ్ల క్రితం ఫ్రిజ్‌లో పెట్టిన అండాలతో కవల పిల్లలకు జన్మనిచ్చింది ఓ మహిళ. అత్యంత సుదీర్ఘ కాలం ఘనీభవించిన అండాలతో పిల్లలకు జన్మనివ్వడం చరిత్రలో ఓ కొత్త రికార్డుగా మారింది. ఏప్రిల్ 22, 1992 సంవత్సరంలో ద్రవరూప నైట్రోజెన్‌లో మైనస్ 128 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతల మధ్య ఆ అండాలను స్టోర్ చేశారు. రేచల్ రిడ్జ్‌వే అనే మహిళ ఆ అండాలతో కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఒరేగాన్‌కు చెందిన ఆమెకు అప్పటికే నలుగురు పిల్లలు ఉన్నారు. అక్టోబర్ 31వ తేదీన ఆ కవలలు జన్మించారు.దానం చేసిన అండాల ద్వారా ఇప్పటి వరకు 1200 చిన్నారులు పుట్టినట్లు నేషనల్ ఎంబ్రియో డోనేషన్ సెంటర్ పేర్కొన్నది. అయితే అత్యంత సుదీర్ఘం కాలం ఘనీభవించిన అండాలతో పిల్లల్ని కనడం ఇదే తొలిసారి అని ఎన్ఈడీసీ పేర్కొన్నది. గతంలో మోలీ గిబ్సన్ అనే మహిళ 2020లో ఘనీభవించిన అండాలతో పిల్లలకు జన్మనిచ్చింది. 27 ఏళ్ల క్రితం నాటి అండాలతో ఆమె శిశువును కన్నది.వివాహం చేసుకున్న జంట నుంచి ఐవీఎఫ్ టెక్నిక్ ద్వారా కవల అండాలను క్రియేట్ చేశారు. 2007 వరకు అమెరికా పశ్చిమ తీరంలోని ఓ ఫెర్టిలిటీ ల్యాబ్‌లో ఉన్న ఆ అండాలను టెన్నిసిలోని నాక్స్‌విల్లేలోని ఎన్ఈడీసికి డోనేట్ చేశారు.

# ఫారెస్ట్ అధికారులు, గిరిజనుల మధ్య చిచ్చుపెట్టిన పోడు భూముల సమస్య–మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

హైదరాబాద్ నవంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ వస్తే పోడు భూములకు పట్టాలు వస్తాయని గిరిజనులు కలలుగన్నారని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... పోడు భూముల సమస్య ఫారెస్ట్ అధికారులు, గిరిజనుల మధ్య చిచ్చుపెట్టింది ముఖ్యమంత్రి అని ఆరోపించారు. ఎనిమిదేళ్లలో ఒకరికి కూడా పట్టా ఇచ్చింది లేదని మండిపడ్డారు. పోడు భూములు ఉన్న దగ్గర హరితహారం మొక్కలు నాటాలని ఫారెస్ట్ అధికారులకు సీఎం సూచిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న ఫారెస్ట్ అధికారి చనిపోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల లతో కమిటీ వేసి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలని... గిరిజనులపై దాడులు ఆపాలని రాములు నాయక్ డిమాండ్ చేశారు.



# బీసీ కార్పొరేషన్‌కి వెంటనే 20 వేల కోట్లు బడ్జెట్‌ను కేటాయించాలి

**-15 రోజుల్లో కేటాయించకపోతే ఇంద్ర పార్క్ దగ్గర ఆమరణ దీక్ష**

**– రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు సి రాజేంద్ర ముదిరాజ్**

హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీసీ కార్పొరేషన్ నిధులు బడ్జెట్ 20వేల కోట్లు కేటాయించాలని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు చెరుకుల రాజేంద్ర ముదిరాజ్ డిమాండ్ చేసారు.గురువారం బిసి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో రాజేందర్ మాట్లాడుతూ 15 రోజుల్లో నిధులు కేటాయించకపోతే ఇంద్రా పార్క్ దగ్గర ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం వచ్చి 9 సంవత్సరాలు గడిచిన బీసీలకు ఇంతవరకు లోన్లు ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమని సి రాజేందర్ ప్రభుత్వం పై మండిపడ్డారు.బ్యాంకుతో సంబంధం లేకుండా ఒక్కొక్క కుటుంబానికి 5 లక్షల నుండి 10 లక్షల వరకు ఇవ్వాలని డిమాండ్ చేసారు.బీసీలు ఓట్లు వేసే యంత్రాలుగా ప్రభుత్వాలు చూస్తున్నారు తప్ప వాళ్ళ ఆర్థిక స్థితిగతుల మీద ఇంత వరకు పట్టించుకోకపోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ ప్రభుత్వం ఎన్నికలలో బీసీలకు వేల కోట్లు ఇస్తున్నట్లు నోటి ద్వారా అనడం




తప్ప ఆచరణలో ఇంతవరకు ఏమి ఇచ్చింది లేదని, కావున బీసీల అందరు ఆలోచించాలన్నారు. ఈసారి బీసీలకు మోసం చేసే ప్రకటనలు చేసే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు.వెంటనే బీసీల స్థితిగతులపై ప్రభుత్వం ఒక ఐదు మంది మంత్రులతో ఒక కమిటీ వేసి నిజా నిజాలు నిగ్గు తేల్చాలన్నారు.బిసి బీసీ కార్పొరేషన్ నిధులు ల పై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కృష్ణయ్య తో చర్చలు జరపాలని రాజేందర్ ప్రభుత్వాన్ని సూచించారు.ఈ సమావేశం లో బిసి ఐఖ్యవేదిక రాష్ట్ర అద్యక్షులు అనంతయ్య,బలరాం,బాలయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల కమిషనర్ అపాయింట్‌మెంట్ ఫైల్లను చూపాలి

**– కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అరుణ్ గోయల్ అపాయింట్‌మెంట్ ఫైల్లను చూపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేంద్రం హడావుడిగా ఆయనను ఈసీగా నియమించడంపై సర్వోన్నత న్యాయస్థానం విస్మయం చెందింది. ఈ నేపథ్యంలో అరుణ్ గోయల్ అపాయింట్‌మెంట్ ఫైల్‌ను గురువారం కోర్టుకు సమర్పించాలని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది.కాగా, పంజాబ్ క్యాడర్‌కు చెందిన 1985 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అరుణ్ గోయల్ 37 ఏళ్లుగా పలు హోదాల్లో పని చేశారు. కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా ఉన్న ఆయన ఈ ఏడాది డిసెంబర్‌లో రిటైర్ అవుతారు. అయితే ఆయన అనూహ్యంగా గత శుక్రవారం స్వచ్ఛందగా పదవీ విరమణ చేశారు. ఆ వెంటనే అరుణ్ గోయల్‌ను ఎన్నికల కమిషనర్‌గా కేంద్ర ప్రభుత్వం శనివారం నియమించింది. దీంతో సోమవారం ఆయన ఆ బాధ్యతలు చేపట్టారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ పదవీ విరమణ తర్వాత ఆ స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు.మరోవైపు ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థలో సంస్కరణలు కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎం జోసెఫ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. సామాజిక కార్యకర్త, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషన్ ఈ సందర్భంగా అరుణ్ గోయల్‌ను కేంద్రం హడావుడిగా ఈసీగా నియమించడాన్ని ప్రశ్నించారు.అయితే కేంద్ర నియామకాలు, నిర్ణయాలపై సుప్రీంకోర్టు జోక్యం తగదని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి అన్నారు. ఆయన వాదనను రాజ్యాంగ ధర్మాసనం ఖండించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ ఎంపికకు సంబంధించిన చట్టం చేయాలన్న పార్లమెంట్ ప్రతిపాదన 72 ఏళ్లుగా అమలు కాలేదని విమర్శించింది. ఈ చట్టం కోసం డిమాండ్ చేస్తూ ఒక ఎన్నికల కమిషనర్ తన పదవికి రాజీనామా చేశారని వ్యాఖ్యానించింది. మాజీ సీఈసీ, దివంగత టీఎన్ శేషన్ ధైర్యంగా తీసుకున్న నిర్ణయాలను పరోక్షంగా ప్రస్తావించింది.కాగా, ఎన్నికల సంఘం వ్యవస్థ ప్రకారమే సీఈసీ, ఈసీల ఎంపిక జరుగుతున్నదని అటార్నీ జనరల్ వెంకటరమణి కోర్టుకు తెలిపారు. ప్రధాని నేతృత్వంలోని మంత్రివర్గం సిఫార్సు చేసిన వారిలో ఒకరిని రాష్ట్రపతి ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఆ మెకానిజాన్ని తప్పుపట్టడం తగదని అన్నారు.ఈ నేపథ్యంలో ఆ వ్యవస్థ ఏమిటన్నది తాము తెలుసుకోవాలనుకుంటున్నామని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. 'ఆ మెకానిజం ఏమిటో మేం చూడాలనుకుంటున్నాం. మేం దానిని విరోధిగా పరిగణించం. దానిని మా రికార్డు కోసం ఉంచుకోం. కానీ ప్రతిదీ 'హంకీ డోరీ' (అంతా సక్రమమవే) అని మీరు చెప్పిన దానిని వేం తెలుసుకోవాలనుకుంటున్నాం. మీకు రేపటి (గురువారం) వరకు సమయం ఉంది. ఎన్నికల కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అరుణ్ గోయల్ అపాయింట్‌మెంట్ ఫైల్‌ను చూపండి' అని కేంద్రాన్ని ఆదేశించింది.

# తెలంగాణ ప్రజలకు బీజేపీ ఉపయోగపడుతుందో శశిధర్ రెడ్డి చెప్పాలి

**-టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి డిమాండ్**

హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నీ వదిలి బీజేపీ లో చేరుతానని ప్రకటించినప్పుడు తెలంగాణ కోసం.. తెలంగాణ ప్రజల కోసం చేరుతున్నానని చెప్పారని,ఏ రకంగా తెలంగాణ కు, తెలంగాణ ప్రజలకు బీజేపీ ఉపయోగపడుతుందో మర్రి శశిధర్ రెడ్డి చెప్పాలని, టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి డిమాండ్ చేసారు. బుదవారం గాంధీ భవన్లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ 8 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పటి వరకు ఎందుకు తెలంగాణ విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదో చెప్పాలన్నారు.తెలంగాణ లో బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ఐఐఎం, ఐటీఐఆర్ ఇవన్నీ రాలేదని మీకు తెలియదా..అని ప్రశ్నించారు.మీరిప్పుడు బీజేపీ లో చేరడం వల్ల ఈ ఎనిమిది ఏళ్లలో జరగనిది ఇప్పుడు జరుగుతుందా ? వాస్తవంగా తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ తెలంగాణ కోసం, తెలంగాణ సకల జనుల కోసం ఇచ్చిన సంగతి మీకు తెలియదా అని ప్రశ్నించారు.మీకు రాజకీయ జన్మ ను ఇచ్చిన తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీ కి కాన్సర్ వచ్చిందని చెపుతూ పార్టీని విడిపోతే అత్యంత దారుణమైన విషయం..భారత దేశంలో ఏ కొడుకు తల్లికి చేయనంత ద్రోహం మీరు చేశారు..అంటే కాన్సర్ తల్లిని నడి బజారులో వదిలిపెట్టిన కొడుకులాగ ప్రజల ముందు నిలబడ్డారన్నారు.మీరు పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్టు అయితే మీరు ఢిల్లీకి వెళ్ళినపుడు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే తో మాట్లాడి సమస్యల పరిష్కారం చేసుకునేవారు. కానీ మీరు ఢిల్లీలో బీజేపీ హోమ్ మంత్రి అమిత్ షా ను డీకే అరుణ, బండి సంజయ్ తో కలిసి బేరం కుదుర్చుకున్నారన్నారు.అమిత్ షా నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పైన మాణిక్యం ఠాగూర్ పైన కేసీ వేణుగోపాల్ పైన అసత్య ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ కి నష్టం కలిగించాలని చూస్తున్నారన్నారు. ఈ జరుగుతున్న మొత్తము లో మనకు అర్థం అవుతుంది ఏమంటే ఆయన బీజేపీలోకి పోవడానికి కాంగ్రెస్ పైన బురద చల్లుతున్నారు..తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వం నెత్తీనోరూ మొత్తుకొని చెబుతుంది.ప్రజాస్వామ్య పరిపాలన లేదు.ప్రతిపక్ష నాయకులను ఈడి, సీబీఐ, ఐటి తో దాడులు చేస్తుంది.భారత్ జోడో యాత్రలో రాహుల్ తో నడిచి మీ భాద ఎందుకు చెప్పుకోలేదు.కాంగ్రెస్ పార్టీని వీడాలనే యాత్రలో పాల్గొనలేదు.గాంధీని చెంపిన గాడ్సే పార్టీ ఎందుకు వెళ్లవు అంటే తెలంగాణ కోసం అని చెబితే ఎవరైనా నమ్ముతారా.బీజేపీ కి వెళ్ళడానికి పిసిసి మీద ఆరోపణలు.తెలంగాణ లో అన్ని మతాల వారు కలిసి మెలసి ఉంటే వాళ్ళను విడదీయడానికి బీజేపీ వస్తుంది.కాంగ్రెస్ పార్టీ భారత దేశం లో పుట్టిన ప్రతి ఒక్కరి డీ ఎన్ ఎ లో ఉంది.

# గోయల్ ఫైల్ మెరుపువేగంతో వెళ్లింది

**–దీన్ని మీరు ఎలా సమర్థిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ధర్మాసనం**

న్యూఢిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా అరుణ్‌గోయల్ నియామకానికి సంబంధించిన ఫైల్ మెరుపు వేగంతో క్లియర్ అయినట్లు ఇవాళ సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 1985వ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అరుణ్ గోయల్‌ను ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఎన్నికల సంఘంలో ఉన్న ఖాళీ మే 15వ తేదీన ఏర్పడిందని, కానీ నవంబర్‌లో ఎందుకు ప్రభుత్వం అంత దూకుడు ప్రదర్శించిందని, ఒకే రోజు క్లియరెన్స్ ఇచ్చారు, అదే రోజు నోటిఫికేషన్ జారీ చేశారని, ఆ రోజే ఎందుకు ఆమోదించారని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది.కనీసం ఆయన ఫైల్ క్లియరెన్స్ కోసం 24 గంటల సమయం కూడా పట్టలేదని కోర్టు తెలిపింది. గోయల్ ఫైల్ మెరుపువేగంతో వెళ్లిందని, దీన్ని మీరు ఎలా సమర్థిస్తారని ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఎన్నికల కమిషనర్ల ఏర్పాటు కోసం స్వతంత్ర్య వ్యవస్థ కావాలని వేసిన పిటిషన్‌పై గత రెండు రోజుల నుంచి అయిదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం విచారణ చేపడుతున్న విషయం తెలిసిందే.

# పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ అసిమ్ మునీర్

న్యూ డిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పాకిస్థాన్ తదుపరి ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ అసిమ్ మునీర్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గురువారం ప్రకటించారు. ప్రస్తుతం ఆర్మీ చీఫ్‌గా ఉన్న ఖమర్ జావెద్ బజ్వా ఈ నెల చివరిలో పదవీ విరమణ పొందనున్నారు. అనంతరం తదుపరి ఆర్మీ చీఫ్‌గా అసిమ్ మునీర్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆ దేశ సమాచార శాఖ మంత్రి వెల్లడించారు.ఆర్మీ చీఫ్‌గా 2016 నవంబరు 29న బజ్వా బాధ్యతలు చేపట్టారు. ఆరేళ్లపాటు పదవిలో కొనసాగిన ఆయన ఈ నెలలో పదవీ విరమణ పొందనున్నారు. కాగా, బజ్వా ప్రస్తుతం తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో పాకిస్థాన్ అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే, బజ్వా కుటుంబసభ్యుల సంపద మాత్రం గత ఆరేళ్లలో అమాంతం పెరిగిపోయింది. ఈ మేరకు ఆదాయ పన్ను రికార్డుల ఆధారంగా ఫ్యాక్ట్ ఫోకస్ వెబ్‌సైట్ సంచలన కథనం ప్రచురించింది. ఆ కథనం ప్రకారం దేశ, విదేశాల్లో ఉన్న బజ్వా ఆస్తుల ప్రస్తుత విలువ రూ.1,270 కోట్లు. ఇది ఆదాయ పన్ను శాఖకు తెలియజేసిన విలువ మాత్రమే అని కథనంలో పేర్కొంది. మరికొద్ది రోజుల్లోనే ఆర్మీ చీఫ్‌గా బజ్వా పదవీకాలం ముగియనున్న సమయంలో ఈ వార్తలు బహిర్గతమవడం పాక్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# అంగన్వాడీ సూపర్ వైజర్ పోస్టుల భర్తీకి హైకోర్టు లైన్ క్లియర్

అమరావతి నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్రంలో అంగన్వాడీ సూపర్ వైజర్ పోస్టుల భర్తీ కి హైకోర్టు లైన్ క్లియర్ చేసింది. తాము ఎంపిక అయినప్పటికీ, మెరిట్ లిస్ట్ లో పేర్లు ఉన్నప్పటికీ ప్రక్రియను నిలిపివేశారని మెరిట్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. మెరిట్ అభ్యర్థుల తరపున న్యాయవాది నర్రా శ్రీనివాస్ కోర్టులో వాదనలు వినిపించారు. విచారణ జరిపిన ధర్మాసనం... గతంలో జరిగిన ఎంపిక ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థుల జాబితాకు లైన్ క్లియర్ చేసింది. కాగా... అంగన్వాడీ సూపర్ వైజర్ల పోస్టుల ఎంపికలో తమకు అన్యాయం జరిగిందని మరికొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అయితే వారి పిటిషన్‌లను కొట్టివేస్తూ పాత ప్రక్రియను కొనసాగించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలియజేశారు.

డా॥ బి.ఆర్. అంబేడ్కర్ స్మారకోపన్యాసం - 37

ఉపన్యాసకులు :
ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి
ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి

అంశం :
ఉన్నత విద్య :
సమానత, సమ్మిళితం - సవాళ్ళు

తేది :
6 డిసెంబర్ 2022, మంగళవారం
సా॥ 5-30 ని॥లకు

స్థలం :
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
ఎన్.టి.ఆర్. ఆడిటోరియం
పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్.



ఆహ్వానం
అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్
(రిజిస్టర్ నెం. 75/1984)
హైదరాబాద్

